



# కరపత్రం

SINCE 2014

సోమవారం అక్టోబర్ 14 2024 | సంపుటి :0 | సంచిక : 6 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# తెలంగాణ ఉద్యమంలో ఐకాస ఏర్పాటుకు స్ఫూర్తి అలయ్ బలయ్



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన అలయ్ బలయ్ కార్యక్రమంలో గొంగళి, కర్రలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ. వేదికపై శ్రీనివాస్‌గౌడ్, ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, గవర్నర్లు హరిభౌ బాగడే, గుర్మీత్ సింగ్, జిష్ణుదేవ్ వర్మ, సీహెచ్ విజయశంకర్, దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి

▲ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి ▲ ప్రజలు అసహ్యించుకునేలా రాజకీయాలను తయారు చేయకండి: కిషన్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పుడు రాజకీయ పార్టీల జెండాలు, ఎజెండాలకు అతీతంగా ఐకాస ఏర్పాటుకు బండారు దత్తాత్రేయ నిర్వహించిన 'అలయ్ బలయ్' స్ఫూర్తినిచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దసరా సందర్భంగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గతంలో అలయ్ బలయ్ లాంటి కార్యక్రమాలు పార్టీల వారీగా ఉండేవన్నారు. కానీ దత్తాత్రేయ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని 19 ఏళ్ల క్రితం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఉద్యమకాలంలో ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ వరకు, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి ఇలా అన్ని సామాజిక వర్గాలను కార్యోన్ముఖుల్ని చేయడానికి సహకరించిందని పేర్కొన్నారు. దత్తాత్రేయ అందించిన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వారసత్వాన్ని ఆయన కుమార్తె విజయలక్ష్మి కొనసాగించాలని, అందుకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ సంస్కృతి గొప్పదనాన్ని నవతరానికి తెలియజెప్పే కార్యక్రమం ఇదని చెప్పారు. త్రిపుర, తెలంగాణ రాష్ట్రాల్లోని సంస్కృతికి సారూప్యత ఉందని పేర్కొన్నారు. భారతీయ పండగలు ఐకమత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'రాజకీయ పార్టీలకు సిద్ధాంతాలు, కార్యక్రమాలుంటాయి. ఎన్నికలప్పుడు పరస్పరం విమర్శలు చేసుకోవచ్చు. ఎన్నికల తరువాత పేదలు, బడుగు బలహీనవర్గాల సంక్షేమం, రాష్ట్రం, నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. దురదృష్టవశాత్తు తెలంగాణలో ఆ స్ఫూర్తి లోపించింది. ప్రజలు అసహ్యించుకునేలా రాజకీయాలను తయారు చేయకండి' అని వ్యాఖ్యానించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ నిరంతరం రాజకీయాల్లో విమర్శలు చేసుకునే వారిని ఒక వేదికపైకి తీసుకురావడం గొప్ప ప్రయత్నమని చెప్పారు. ఇదే స్ఫూర్తితో విభేదాలు మరచి అంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

# వచ్చే నెలలో ట్రిపుల్‌ఆర్ టెండర్!

- ఉత్తర భాగానికి నోటిఫికేషన్ జారీ చేయనున్న ఎన్‌హెచ్‌ఏఐ
- అందుకు వీలుగా టెండర్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ కొలిక్కి
- పర్యావరణ అనుమతులు వచ్చాక నిర్మాణ సంస్థ ఖరారు
- ఈలోపు రోడ్డు నంబర్ కేటాయింపు.. అటవీ అనుమతుల జారీ

ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగురోడ్డు) నిర్మాణానికి కేంద్రం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి వీలుగా ఎన్‌హెచ్‌ఐఏ ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగం టెండర్ డాక్యుమెంటేషన్‌పై దృష్టి సారించింది. వచ్చే నెల మొదటి వారంలో టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి.

2లో..



## పర్యావరణ అనుమతులు రాకుండానే..

ట్రిపుల్‌ఆర్ విషయంలో ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది. దీంతో భవిష్యత్‌లో మరింత ఆలస్యం జరగకుండా చూడాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది. పర్యావరణ అనుమతులు రాకుండా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయటానికి వీలులేదు. కానీ, టెండర్లు పిలిచేందుకు అది అడ్డంకి కాదు. దీంతో పర్యావరణ అనుమతులు వచ్చేలోగా టెండర్లు పిలిచి, పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

# విదేశాలకు బియ్యం, నూకల ఎగుమతి

## హాకా నిర్ణయం.. ఇప్పటికే నూకలకు కేంద్రం అనుమతి

2 లో




రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘం(హాకా) ద్వారా నూకలు, బియ్యం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నూకల ఎగుమతికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించగా.. త్వరలోనే బియ్యం ఎగుమతులు సైతం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంస్థను ఆదేశించింది. హాకా ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన సరకులను, ఫర్నిచర్‌ను సరఫరా చేస్తోంది. చిన్నచిన్న వ్యాపారాలు కాకుండా లాభార్జన కోసం భారీఎత్తున ఎగుమతులు చేపట్టాలని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ సంస్థను ఆదేశించారు.

# హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మిపై కేసు నమోదు

బతుకమ్మ వేడుకల్లో డీజే ఉపయోగించినందుకు గానూ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు సుమోటాగా కేసు నమోదు చేశారు. నిర్దేశిత సమయం దాటిన తరువాత పెద్ద సౌండ్‌తో డీజే పెట్టారని ఎఫ్ఐఆర్‌లో పొందు పరిచారు. మేయర్‌తో పాటు నిర్వాహకులు విజయ్‌కుమార్, గౌస్ ల మీద కేసు నమోదయ్యింది.



# మూడు, నాలుగేళ్లలో 300 గనుల మూసివేత

జీఎస్ఐ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, అధికారులు



బండ్లగూడ, న్యూస్‌టుడే: పర్యావరణంతో పాటు ప్రకృతికి విఘాతం కలిగిస్తున్న.. దేశవ్యాప్తంగా ఉన్న 300 బొగ్గు గనులను రానున్న మూడు, నాలుగేళ్లలో మూసివేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) శిక్షణ సంస్థలో పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం సాంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తి 2.18 గిగావాట్లుగా ఉందని, 2030 నాటికి 500 గిగావాట్ల లక్ష్యంగా కేంద్రం పనిచేస్తుందన్నారు. పునరుత్పాదక రంగానికి భవిష్యత్తులో రూ.50 వేల కోట్ల కేటాయింపులు ఉంటాయన్నారు. మూసివేసే బొగ్గుగనుల ప్రాంతాల్లో మొక్కలు పెంచేందుకు, రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించామన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు.


మిగతాద్ది 2 లో

# తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి కాపాడుతున్నది ఎవరు?

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ నేతలను ఈడీ నుంచి కాపాడుతున్నది ఎవరని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇటీవల ఓ ధనికుడైన మంత్రి నివాసంలో ఈడీ దాడులు చేసిందని, ఇప్పటి వరకు అందుకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు రాలేదని ఆరోపించారు. కల్పనకంటే వాస్తవికత వింతగా ఉందని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, అయితే ఇప్పుడు దానిని నమ్మాల్సి వస్తోందని 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మంత్రి నివాసంలో దాడులు చేసిన సమయంలో రూ.100కోట్ల నగదు పట్టుబడినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని ఆరోపించారు. కానీ, ఇప్పటి వరకు కాంగ్రెస్, భాజపా, ఈడీ .. ఈ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. వాల్మీకి కుంభకోణం నుంచి రూ.40కోట్లకు పైగా అక్రమ సొమ్మును ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ ఉపయోగించినట్టు కర్ణాటకలో ఈడీ పేర్కొందని కేటీఆర్ ఆరోపించారు. ఇందులో కూడా ఇప్పటి వరకు ఎలాంటి అరెస్టులు లేవని ధ్వజమెత్తారు.



# సంపాదకీయం




## పొరలు ఒలిచే రచయిత

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది గెలుచుకోవడం ద్వారా ఆ గౌరవం పొందిన తొలి ఆసియా రచయిత్రిగా నిలిచింది దక్షిణ కొరియాకు చెందిన హాన్ కాంగ్ (సరైన ఉచ్చారణ: హన్ గాన్ ). ప్రతి ఏడాదీ జరిగినట్టుగానే ఈసారీ అందరి అంచనాలు తలకిందులైనాయి. చైనా రచయిత్రి కాన్ షుయె, ఆస్ట్రేలియా రచయిత జెరాల్డ్ మర్నేన్, జపాన్ రచయిత హరూకి మురకామి నుంచి భారత మూలాలున్న సల్మాన్ రష్దీ వరకు ఎవరిని వరించొచ్చనే విషయంలో బెట్టింగ్స్ నడిచాయి.కానీ 'చారిత్రక విషాదాలను ప్రతిఘటించే, మానవ దుర్బలత్వాన్ని ఎత్తి చూపే తీక్షణమైన కవితాత్మక వచనానికి'గానూ హాన్ కాంగ్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించింది స్వీడిష్ అకాడెమీ. 2016లో తన కొరియన్ ఆంగ్లానువాద నవల 'ద వెజిటేరియన్ 'కు 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' గెలుచుకున్న హాన్ కాంగ్ ఆ పురస్కారం పొందిన తొలి కొరియన్ రచయిత కూడా కావడం విశేషం.దక్షిణ కొరియా ప్రసిద్ధ రచయిత హాన్ సుయెంగ్–వొన్ కూతురిగా 1970లో జన్మించిన హాన్ కాంగ్ సాహిత్య ప్రయాణం– మనుషుల్ని మనుషులే పీక్కు తినే ఈ సమాజంలో దానికి విరుగుడు ఏమిటనే శోధనతో మొదలైంది. 'మనుషులు మొక్కలు కావాల్సిందని నా నమ్మకం' అంటాడు 28 ఏళ్లకే క్షయ వ్యాధితో మరణించినప్పటికీ కొరియన్ సాహిత్య రంగం మీద ప్రబలమైన ముద్రవేసిన యీ సంగ్. అదొక నిరసన! ప్రస్తుతం సుమారు ఐదు కోట్ల జనాభా ఉన్న దక్షిణ కొరియా చరిత్రలో మాయని మచ్చలైన జపాన్ దురాక్రమణ (1910–45), కొరియన్ యుద్ధం(1950–53) తర్వాత, అలాంటిదే– సైనిక పాలనకు వ్యతిరేకంగా తలెత్తిన విద్యార్థుల తిరుగుబాటు (1980)ను అణచివేసే క్రమంలో జరిగిన 'మే 18' ఘటన. కాంగ్‌కు తొమ్మిదేళ్లున్నప్పుడు ఆమె జన్మించిన గ్వాంగ్జు పట్టణం నుంచి వాళ్ల కుటుంబం సియోల్‌కు వెళ్లిపోయింది. సరిగ్గా నాలుగు నెలల తర్వాత అక్కడ వేలాది విద్యార్థులు, పౌరులు చనిపోయారు. తనకు ప్రత్యక్షంగా అనుభవం లేని ఈ ఘోరాలను పెద్దయ్యాక తెలుసుకునే క్రమంలో అంతులేని పశ్చాత్తాపానికి గురైంది కాంగ్. వాళ్ల కుటుంబం బతికుండటానికీ, ఇంకో కుటుంబం లేకుండాపోవడానికీ కారణమే లేదు. ఒక చిన్న నిర్ణయం వాళ్ల గతిని మార్చింది. గ్వాంగ్జు, ఆష్విట్స్, బోస్నియా– ప్రపంచమంతటా ఇదే హింస. అయితే, గాయాల పాలైనవారికి రక్తం ఇవ్వడం కోసం తమ భద్రతకు కూడా వెరవకుండా వేలాది మంది ఆసుపత్రుల ముందు వరుసలు కట్టిన ఫొటోలు కాంగ్‌లో ఉద్వేగాన్ని పుట్టించాయి. వర్తమానం గతాన్ని కాపాడుతుందా? బతికున్నవాళ్లు పోయినవాళ్లను కాపాడగలరా? 'దొరక్కపోయినా జవాబుల కోసం రచయితలు వెతకడం మానరు'. ఎంతటి క్రౌర్యానికైనా మనిషి వెనుదీయడుబీ అదే సమయంలో, 'రైల్వే ట్రాక్ మీద పడిపోయిన పసికందును కాపాడటానికి తన ప్రాణాలను సైతం లెక్కించడు'. మనిషిలోని ఈ రెండు ముఖాల ప్రహేళికను చిత్రిస్తూ 'హ్యూమన్ యాక్ట్స్' నవల రాసింది కాంగ్. రచనల్లో రాజకీయ ప్రకటనలు చేయాల్సిన అవసరం లేకుండా– మనిషిలోని అంతులేని క్రూరత్వాన్నీ, దాని మరుగునే ఉన్న మృదుత్వాన్నీ తవ్వి తీసింది.పుట్టిన రెండు గంటలకే చనిపోయి తన తల్లిదండ్రులు ఎన్నటికీ బయటపడలేని దుఃఖానికి కారణమైన తను ఎన్నడూ చూడని తన 'అక్క' హాన్ కాంగ్‌కు ఓ పుండులా మిగిలిపోయింది. 'గాయం అనేది మాన్చుకోవాల్సిందో, బయటపడాల్సిందో కాదుబీ దాన్ని ఆలింగనం చేసుకోవాలి' అంటుందామె. కాలం వల్ల, మరణం వల్ల, ఇతర విషాదాల వల్ల మనుషులు ఇతరులతో సంభాషించే శక్తిని కోల్పోతారు. అంధత్వం వల్ల రాయగలిగే, చదవగలిగే సామర్థ్యాన్ని కోల్పోయిన ఒక ప్రాచీన–గ్రీక్రు బోధకుడు, తీవ్ర కుటుంబ విషాదాల వల్ల నోరు లేకుండాపోయిన ఆయన విద్యార్థిని పరస్పరం సమాచారాన్ని పంచుకోవడానికి చేరుకునే గౌరవపూరిత సామీప్యతను చిత్రించడానికి 'గ్రీక్ లెసన్ ్స' నవల రాసింది కాంగ్. మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన 'నిరంతర మృదు స్పర్శ'ను నొక్కి చెప్పింది. తద్వారా భాషా సూక్ష్మతనూ, గెలుచుకోగలిగే జీవన సౌందర్యాన్నీ పట్టిచూపింది.హాన్ కాంగ్ ఎంత వేగంగా టైప్ చేయగలదంటే, 'నమ్మండి నమ్మకపోండి' లాంటి టీవీ షోలో పాల్గొనమని ఆమె మిత్రులు నవ్వుతూ అనేంతగా! ఆమె రచనల్లోని ధారకు సరితూగేట్టుగా టైప్ చేసే క్రమంలో పుట్టిన నొప్పులకు కొన్నాళ్లు వేళ్లు కదపలేని పరిస్థితి వచ్చింది. మణికట్టు నొప్పి వల్ల పెన్నుతోనూ రాయలేదు. కొంతకాలం పెన్నును తిరగేసి పట్టుకుని ఒక్కో అక్షరాన్ని నొక్కుతూ టైప్ చేసేది. కవయిత్రిగా మొదలైన కాంగ్‌కు సంగీతమూ తెలుసు. పాటలు రాసి, తానే స్వరపరిచి, ముందు వద్దనుకున్నా ఆ తర్వాత ఆ మొత్తం పాడి ఒక పది పాటల సీడీ విడుదల చేసింది. ఆమె రచనల్లోనూ ఈ సంగీతం మిళితమై ఉంటుంది. 1993లో మొదలైన కాంగ్ మూడు దశాబ్దాల సాహిత్య ప్రయాణంలో నవలలు, నవలికలు, కథలు, కవితలు, వ్యాసాలు రాసింది. ఎన్నో పురస్కారాలను అందుకుంది. తరచూ వేధించే తీవ్రమైన తలనొప్పులు తనను అణకువగా ఉంచడంలో సాయపడుతున్నాయంటుంది. ఆమెకు ఒక కొడుకు. నోబెల్ వార్త తెలిసినప్పుడు అతడితో కలిసి కాఫీ తాగుతోందట. 2114 సంవత్సరంలో ప్రచురించనున్న 'ఫ్యూచర్ లైబ్రరీ ప్రాజెక్ట్' కోసం 'డియర్ సన్, మై బిలవ్డ్' సమర్పించిందామె. అందులో ఏం రాసివుంటుంది? మనిషి హింసను ఎదుర్కొనే సున్నిత ప్రతీకారం మరింత మానవీయతను చూపడమేనని మరోసారి నొక్కి చెప్పివుంటుందా!

# సమయం లేదు మిత్రమా.. 60 రోజులే గ్యాప్..

## ఆ లెక్క తేలగానే పంచాయతీ సమరం..

రెండునెలల తర్వాత ఏ క్షణాన్నయినా టీ–దంగల్. మూడు ప్రధాన పార్టీల మధ్య నయా వెర్షన్‌తో రసవత్తర పోరు. అవును.. మీరు వింటున్నది నిజమే.. జస్ట్ 60 రోజుల తర్వాత తెలంగాణలో రాజకీయ రణరంగం షురూ కాబోతోంది. లోకల్‌వార్ కమింగ్‌సూన్.. మేం రెడీ.. మీరు రెడీనా అంటూ మిగతా పార్టీలకు ఓపెన్ ఛాలెంజ్ విసరబోతోంది రూలింగ్ పార్టీ. తెలంగాణలో సడన్‌గా ఎన్నికల హీట్ ఎలా మొదలైంది.. దీనికి రూట్ కాజ్ ఏంటి..? అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్.. జీవో నంబర్ 18ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణన చేస్తున్నామని, 60 రోజుల పాటు జరిగే సర్వేతో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆటంకం తొలగిపోతుందని క్లారిటీ ఇచ్చారు పొన్నం ప్రభాకర్.. అంటే.. రెండు నెలల తర్వాత పంచాయతీ పోరు తప్పకుండా జరుగుతుందంటూ చెప్పకనే చెప్పారు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం. 'రాష్ట్రంలో బీసీల లెక్క తేలాల్సిందే.. వాళ్లకు దక్కాల్సిన వాటా దక్కాల్సిందే' అని ఎన్నికలకు ముందునుంచీ చెబుతూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఆ దిశగా క్రియాత్మకంగా వేసిన అడుగు ఇది. ఫిబ్రవరి 4న క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఆ వెంటనే అసెంబ్లీ ఆమోదించింది. బిహార్‌లో చేపట్టిన కుల సర్వేను కూడా పరిశీలించింది. కానీ.. సర్వే చెయ్యడానికి సరిపడా యంత్రాంగం తమ వద్ద లేదని బీసీ కమిషన్ వెనక్కు తగ్గడంతో.. ప్రణాళిక విభాగం సపోర్ట్ తీసుకోవాలని సలహా ఇచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంటింటికీ తిరిగి 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఇప్పుడు జీవో 18 జారీ చేసింది ప్రభుత్వం. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కులాల పరంగా లెక్క తేల్చడానికి ఈ సర్వే ఉపయోగపడుతుంది.


### విమర్శలతో ప్రభుత్వం క్లారిటీ..

లోకల్‌బాడీ ఎలక్షన్స్‌కి సంబంధించి.. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని ఇటీవల విమర్శలొచ్చాయి. వాటన్నిటినీ కొట్టిపారేస్తూ.. కులగణన తర్వాత ఎన్నికలు జరుగుతాయని హింట్ ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం. రెండునెలల తర్వాత.. ఏ క్షణంలోనైనా స్థానిక సంస్థల ఎన్నికల సమరం మొదలుకావొచ్చని పొన్నం మాటల ద్వారా స్పష్టమైంది. ఎన్నాళ్లో ఎదురుచూసిన కులగణన.. ఎట్టకేలకు మొదలుకావడంతో బీసీ సంక్షేమ సంఘం కూడా హర్షం వ్యక్తం చేసింది. రెండునెలల్లో సర్వే పూర్తయ్యి.. నివేదిక సిద్ధమై.. బీసీల జనాభాపై క్లారిటీ వస్తే.. దానికి తగ్గట్టు స్థానిక సంస్థల్లో బీసీ కోటా ఖరారయ్యే ఛాన్సుంది. బీసీలకు రాజకీయ అవకాశాల్ని పెంచింది మేమే అనే నినాదంతో లోకల్‌వార్‌కి సిద్ధం కావాలన్నది కాంగ్రెస్ పార్టీ ఆలోచన. సో ఎక్స్‌ట్రాగా యాడయ్యే బీసీ ఫ్లేవర్‌తో మూడు పార్టీల మధ్య స్థానిక సమరం మరింత రంజుగా మారే ఛాన్సుంది.

# వచ్చే నెలలో ట్రిపుల్ఆర్ టెండర్!

మొదటిపేజీ తరువాయి

టెండర్లు తెరిచే నాటికి అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్
జాతీయ రహదారి హోదాలో కేంద్రం ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు చేపడుతోంది. ఉత్తర భాగం విషయంలో ఆ స్పష్టత ఉంది. దక్షిణభాగాన్ని కేంద్రం కాకుండా సొంతంగానే చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తర భాగాన్ని సొంత నిధులతో కేంద్రమే నిర్మిస్తోంది. గతంలో కేవలం జాతీయ రహదారిగా మాత్రమే దాన్ని పరిగణించింది. కానీ, ఇటీవల దాన్ని ఎక్స్‌ప్రెస్‌వే జాబితాలో చేర్చింది. అప్పటి వరకు తాత్కాలికంగా దానికి 161ఏ నంబర్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. ఇప్పుడు అది కాకుండా ఎక్స్‌ప్రెస్‌వేగా కొత్త నంబర్ కేటాయించనున్నారు. ఈ నంబర్ అలాట్ అయిన తర్వాతే ఫారెస్టు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే ఈ రోడ్డుకు సంబంధించి పబ్లిక్ హియరింగ్స్ ప్రక్రియ పూర్తి చేశారు. పర్యావరణ అనుమతులకు అది కీలకం.
రోడ్డు నంబర్ అలాట్ అయిన తర్వాతనే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. త్వరలో



ఆ రోడ్డు నంబర్ కేటాయించే అవకాశముంది. పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాతే టెండర్లు తెరవాల్సి ఉంటుంది. ఈ తతంగం పూర్తయ్యే వరకు టెండర్ల కోసం ఎదురు చూడకుండా, ముందు నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు భూపరిహారం పంపిణీకి వీలుగా గ్రామాల వారీ అవార్డులు పాస్ చేసే ప్రక్రియ కూడా నిర్వహించాల్సి ఉంది.ఇది జరగాలంటే పరిహారం నిధులు ఎన్‌హెచ్‌ఏఐకి కేటాయించాలి. ఉత్తర భాగం భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం మొత్తాన్ని భరించాల్సి ఉన్నందున, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేయాలి. ఈ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయించింది. సమాంతరంగా ఈ ఏర్పాట్లు చేస్తూనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించబోతున్నారు. వచ్చేనెల మొదటి వారంలో టెండర్లు పిలిచి నిర్ధారిత గడువులోపు నిర్మాణ సంస్థను ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత వీలైనంత తొందరలో పనులు ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది.

# మూడు, నాలుగేళ్లలో 300 గనుల మూసివేత

మొదటిపేజీ తరువాయి

జీఎస్ఐ శిక్షణ సంస్థలో 150 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్తు ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా ఏటా సంస్థకు రూ.30 లక్షలు ఆదా అవుతాయని సంస్థ డైరెక్టర్ జనరల్ డా.మాథ్యూ జోసఫ్ తెలిపారు. అంతకుముందు సంస్థ ఆవరణలో కేంద్రమంత్రి మొక్కలు నాటారు. జీఎస్ఐ సంస్థ ఏడీజీ ఎస్.డి.పట్నాజీ, పీఆర్‌వో గంజి మల్లేశ్, కార్పొరేటర్లు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, భాజపా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# విదేశాలకు బియ్యం, నూకల ఎగుమతి

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు హాకా నూకల ఎగుమతిపై దృష్టి సారించింది. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో నూకలకు డిమాండ్ ఉండడంతో లాభదాయకమని భావించి దాని ఎగుమతి కోసం దరఖాస్తు చేసుకోగా కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల హాకాపై ఇటీవల సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి బియ్యం ఎగుమతులు సైతం ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు సంస్థ దానిపై అధ్యయనం చేసింది. తెలంగాణ బియ్యం దిగుమతికి విదేశాలతోపాటు ఇతర రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయి. ఫిలిప్పీన్స్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు బియ్యం ఎగుమతి ప్రభుత్వ సంస్థలు లేవు. రైస్‌మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ఎగుమతి చేస్తున్నారు. ఇప్పుడు హాకా ముందుకు రావడంతో బియ్యం ఎగుమతికి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా అనుమతి లభించే అవకాశం ఉంది. తద్వారా అది ఇతర రాష్ట్రాలకు బియ్యం రవాణా చేయవచ్చు. విదేశాలకు సరఫరా కోసం కేంద్రం అనుమతి అవసరమైనందున త్వరలో దరఖాస్తు చేసుకోవాలని హాకా నిర్ణయించింది. దీని కోసం మంత్రి తుమ్మల కూడా కేంద్రానికి లేఖ రాయనున్నారు.

# వామ్మో జర్రుంటే పాణం పోయేది..

## ఉడిపి హోటల్‌లో పిల్లలకు ఇడ్లీ తినిపిస్తుండగా..



అదో ఉడిపి హోటల్.. ఇంకేముంది మనం ముందు వెనుక ఏం ఆలోచించకుండా వెళ్లి వెంటనే టిఫిన్ ఆరగించేస్తాం.. అలా వెళ్లిన ఓ కస్టమర్ కు దిమ్మతిరిగిపోయే ఘటన ఎదురైంది.. పిల్లలను ఉడిపి హోటల్ కు తీసుకెళ్లిన ఓ కస్టమర్.. ఇడ్లీ ఆర్డర్ చేశాడు. వెయిటర్లు కూడా వెంటనే ఇడ్లీలు ప్లేట్లో పెట్టి ఇచ్చేశారు. ఇలా తినిపిస్తున్న క్రమంలో ఇడ్లీలోనుంచి జెర్రీ ప్రత్యక్షమైంది.. ఇది చూసి కంగుతిన్న కస్టమర్ .. వెంటనే యజమాని దృష్టికి తీసుకెళ్లాడు.. ఈ షాకింగ్ ఘటన తెలంగానలోని జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రముఖ గణేష్ భవన్ ఉడిపి హోటల్లో ఓ కస్టమర్ ఇడ్లీ ఆర్డర్ ఇచ్చాడు.. ఆ తర్వాత ఇడ్లీలను పిల్లలకు తినిపించే సమయంలో చనిపోయిన జెర్రీ కనిపించింది.. ఇలా జరిగిందంటూ యజమాని దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించలేదు.. అది జెర్రీ కాదంటూ బుకాయించాడు.. దీంతో ఓనర్‌తో కస్టమర్.. వాగ్వాదానికి దిగాడు..అయితే.. అది జెర్రీ కాదంటూ బుకాయిస్తూ.. ఓనర్ దానిని నోట్లో వేసుకున్నాడు.. ఈ క్రమంలోనే అది జెర్రీ అని తెలడంతో ఓనర్ ఉమ్మేశాడు.. వెంటనే అప్రమత్తమైన హోటల్ నిర్వాహకులు.. ఇడ్లీలను బల్దియా టాక్టర్‌లో తరలించే ప్రయత్నం చేశారు.. దీంతో కస్టమర్ అడ్డుకుని ఇడ్లీ లతో రోడ్డు పై బైఠాయించాడు.. చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు..

## పోతిరెడ్డిపల్లి దసరా వేడుకల్లో పాల్గొన్న సీనియర్ నాయకులు పరిపాటి రవీందర్ రెడ్డి..



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 13.**



దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో పరిపాటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా వేడుకలను నిర్వహించారు. డప్పు చప్పుల మధ్య జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం జమ్మి ఆకులను ఒకరికొకరు పంచుకొంటూ దసరా శు భాకాంక్షలు తెలుపుకున్నారు.సీనియర్ నాయకులు పరిపాటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్తులకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ,చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ మహోత్సవాన్నిజరుపుకుంటారని తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో సంతోషంగా ఉండాలన్నారు.

## బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ..

### - ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్..



**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 13.**

వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన తొంటి లక్ష్మి, శ్రీరాం ప్రభాకర్,ఇటీవల అనారోగ్యానికి గురై, ఖర్చుల పాలవడంతో , ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ను ఆశ్రయించగా, ఆయన వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా బాధితులైన తొంటి లక్ష్మి కి 29,000 రూపాయలు, శ్రీరాం ప్రభాకర్ కి 17,000 రూపాయలను మంజూరు చేసి, ఈ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బండి అవినాష్, కంబాల రమేష్ చేతుల మీదుగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బాధిత కుటుంబాలకు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ పథకం కింద ఆర్థికంగా సహాయం చేసిన బల్మూరి వెంకట్ కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 13.**



తాటి చెట్టు పైనుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వల్భపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పల్లె స్వామి వృత్తిలో భాగంగా శుక్రవారం ఉదయం తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడని దీంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయని గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో తీసుకెళ్లారని తెలిపారు.స్వామి నిరుపేద కుటుంబం అయినందున ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

## సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికి దసరా పండుగా శుభాకాంక్షలు. తెలిపిన రవి ముదిరాజ్.

**కరపత్రం దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి.**

**జి రవి ముదిరాజ్**

**- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓ బి సి అధ్యక్షులు.**





దసరా పండుగా సందర్భంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని వారి నివాసములో కలిసి వారికి శు భకాంక్ష్యాలు తెలియజేసినా మేడ్చల్ నియోజిక వర్గా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో వచ్చి సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏ ఈ ఈ ఉద్యోగం సాధించిన రజక బిడ్డ... వాసంతికి.. ఘన సన్మానం...

### - సన్మానం చేసిన గ్రామ రజక సంఘం నాయకులు...



**కరపత్రం శంకరపట్నం అక్టోబర్ 13**

సామాన్య రజక కుటుంబంలో పుట్టిన బిడ్డ ఏ ఈ ఈ ఉద్యోగం సాధించడంతో ఆ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడారు. స్టేషన్ ఘనపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో పొన్న వాసంతి ఏఈఈ ఉద్యోగం వచ్చిన సందర్భంగా పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన పొన్న రేణుక రాజశేఖర్ దంపతుల కూతురు పొన్న వాసంతి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీటెక్ చదివింది , జనగామ జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది , ఉద్యోగం చేస్తున్న క్రమంలోనే ఏ ఈ ఈ జాబ్ వచ్చిందని,పొన్న రాజశేఖర్ రేణుక దంపతులకు ఒక కుమారుడు కుమార్తె , కుమారుడు మైనింగ్ ఇంజనీరింగ్ చేసి చతిస్గడ్ రాష్ట్రంలో మైనింగ్ కంపెనీలో ఇంజనీర్ ఉద్యోగం చేస్తున్నాడు, కుమార్తె పొన్న వాసంతి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ చదివి, కోర్టు లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి, ఉద్యోగం చేస్తున్న క్రమంలో మళ్లీ ఉన్నంత ఉద్యోగానికై రాసిన ఏఏఈ పరీక్షల్లో ఎన్నికై సందర్భంగా ఈ సన్మానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది , ఈ కార్యక్రమంలో రజక సంఘం పెద్దమనిషి పొన్న ఉపేందర్, పొన్నరవి, పొన్న మధు కుమార్ , ఎలిషాల రాజేశ్వర్,పొన్న వెంకటయ్య, పొన్న బిక్షపతి, పొన్న సత్యనారాయణ, పొన్న శేఖర్,పొన్న దుబాయ్ శీను, పొన్న రాజు,టెంట్ హౌస్ రమేష్,పొన్న రమేష్ రైల్వే, పొన్న రాజు, పొన్న పెద్దరాజు, పొన్న గౌతమ్, పొన్న జై చందర్, పొన్న రమేష్ డ్రై క్లీనింగ్,మచ్చ శ్రీను రైల్వే, పొన్న రాజు, నూతనకంటి కొండన్న, పొన్న రాజు,పొన్న నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రుల శోభాయాత్ర

- తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించిన
- నీలం శ్రీలత పటాన్చెరువు తాలూకా మత్స్యశాఖ డైరెక్టర్
- జాతీయ సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత సామాజిక సంఘ నాయకురాలు





**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి జిల్లా ప్రతినిధి.**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో అశ్వయుజ మాస దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారి విగ్రహం ప్రతిష్టాపన నిర్వహించి, తొమ్మిది రోజులు ప్రతినిత్యం అమ్మవారికి వివిధ రూపాలతో విశేష పూజలు, దీక్షపరులచే భక్తులచే భజనలు కీర్తనలు నిర్వహించి, గ్రామంలో ప్రత్యేక శోభాయాత్ర నిర్వహించడం జరిగింది,ముందుగా నీలం శ్రీలత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకోవడం జరిగింది,అనంతరం నీలం లత పటాన్చెరువు నియోజకవర్గ మత్స్యశాఖ డైరెక్టర్, సామాజిక సంఘ సేవకురాలు, సావిత్రిబాయి పూలే జాతి అవార్డు గ్రహీత ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత సాంప్రదాయ పండుగలు ప్రతిష్టాత్మకంగా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కన్నుల పండుగగా పండుగలు నిర్వహించుకోవడం దేవి శరన్న వరాత్రుల భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, విజయదశమి పండుగను జిన్నారం మండల ప్రజలు జిన్నారం మండల కేంద్రంలో కన్నుల పండుగగా నిర్వహించుకోవడం జరిగింది భారత సంప్రదాయ పండుగలను కులమతాల కు అతీతంగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది అన్నారు,మహిళ పురుషులు పిల్లలు కొత్త బట్టలు ధరించి దసరా రోజునాడు స్నేహితులను బంధుమిత్రులను జంబి ఆకు ఇచ్చి అలై బలై తీసుకొని మమకారాన్ని పంచుతూ బతుకమ్మ పాటలు పడుతూ చిందులు వేస్తూ సంతోషాన్ని పంచుకోవడం జరుగుతుంది అని ఇటువంటి భారత సంప్రదాయ పండుగలను ప్రేమ అనురాగాలతో కులమతాలకు అతీతంగా పండుగను నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది అన్నారు,తెలంగాణ రాష్ట్ర ప్రజలు జిన్నారం మండల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి కోరుకోవడం జరిగింది.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ గా ఎల్లారెడ్డి..

**కరపత్రం శంకరపట్నం: అక్టోబర్ 13**



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కరివినర్ గా మోతే ఎల్లారెడ్డిని నియామకం చేసినట్లు కరీంనగర్ జిల్లా కన్వీనర్ కనకం కుమారస్వామి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు కరీంనగర్ జిల్లా ,మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం మాజీ వైస్ ఎంపీపీ కన్నాపూర్ గ్రామానికి చెందిన మోతే ఎల్లారెడ్డి మలిదశ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో శంకరపట్నం మండలంలో ముందుండి ఉద్యమాన్ని రూతలోగించారని ఆయన ఉద్యమ పోరాటాన్ని గుర్తించి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ సూచన మేరకు, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ గా ఎల్లారెడ్డిని నియామకం చేయడం జరిగిందని, కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్గా నియామకముకు కృషి చేసిన, ఈ నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ముఖ్య సలహాదారుడు ఓరుగంటి ఓరుగంట ఆనంద్, కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, రాష్ట్ర నాయకులకు, జిల్లా బాధ్యులకు, మండల ల నాయకులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు ముందు ఉంటానని ఎల్లారెడ్డి తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన మండల నాయకులు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ గా మోతే ఎల్లారెడ్డి నియామాకమైనందుకు, శంకరపట్నం మండలం ఉద్యమకారులు, అది ప్రజా ప్రతినిధులు స్నేహితులు మిత్రులు హరిశం వ్యక్తం చేశారు.

## గన్ముకులలో ఘనంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర...

### - భవాని శంకర స్వామి ఆలయ చైర్మన్ జిన్నారపు శివకుమార్...

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, అక్టోబర్ 13.**



వీణవంక మండలం ఘన్ముకుల గ్రామంలో ఆదివారం భవాని శంకర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ను నిర్వహించారు. గ్రామంలోని మహిళలు మంగళ హారతులు పడుతూ, టెంకాయ కొట్టి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ముందు చిన్నారులు,నృత్యాలు చేస్తూ అందరిని అలరించారు. గ్రామంలోని ప్రజలు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, దుర్గ మాత అనుగ్రహాన్ని పొందారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ... గ్రామంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సకాలంలో వర్షాలు పడి, రైతులందరూ ధన, ధాన్య, సంపద సమృద్ధిగా కలిగి ఉండాలని, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, అమ్మవార్ల కరుణాకటాక్షంతో గ్రామ ప్రజలు చల్లగా వర్ధిల్లాలని, దేవీ నవరాత్రులకు సహకరించిన గ్రామస్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి హిందువులందరూ ఏకం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జిన్నారపు శివకుమార్,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# టర్కిష్ ఎయిర్‌లైన్స్ 24 గంటలు ఆలస్యం.. తాప్సి ఆగ్రహం

సినీనటి తాప్సి తనకు ఎదురైన ఓ చేదు ఘటనను సోషల్ మీడియాలో షేర్ చేశారు. టర్కిష్ ఎయిర్‌లైన్స్ 24 గంటలు ఆలస్యమైందని, మరోవైపు కస్టమర్ కేర్ సర్వీసు కూడా అందుబాటులో లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్‌లైన్స్ 24 గంటలు ఆలస్యం అనేది మీ సమస్య. ఇది ప్రయాణికుల సమస్య కాదు అని ఆమె పోస్ట్‌లో పేర్కొన్నారు. విమానం ఆలస్యంపై ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు వైరల్ అయ్యింది.అయితే, తనకు ఎదురైన ఈ అనుభవం ఎప్పుడు జరిగిందనే విషయాన్ని మాత్రం ఆమె వెల్లడించలేదు. ఇటీవల ప్రముఖ నటి శ్రుతిహాసన్.. విమానయాన సంస్థ ఇండిగో సేవలపై అసహనం వ్యక్తం చేశారు. విమానం ఆలస్యంపై ప్రయాణికులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. దీంతో తనతో పాటు తోటి ప్రయాణికులు ఎంతగానో ఇబ్బంది పడ్డారని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇండిగో స్పందించింది. విమానం ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని వివరించింది.

# నానీ దసరా హిట్ కాంబో మళ్ళీ రిపీట్..



టాలీవుడ్ ప్రముఖ హీరో నేచురల్ స్టార్ నాని సరిపోదా శనివారం చిత్రంతో హిట్ ట్రాక్ కంటిన్యూ చేస్తున్నాడు. అలాగే ఈ మధ్య కథల విషయంలో కూడా రూట్ మర్చినట్లు తెలుస్తోంది. అయితే గతంలో తనకి దసరా చిత్రంతో బిగ్ హిట్ ఇచ్చిన నూతన దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో రెండో చిత్రాన్ని చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ సినీ నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ చిత్రాన్ని లాంచ్ చేశారు.గతంలో సింగరేణి బొగ్గు గనుల బ్యాక్ డ్రాప్ స్టోరీ తో హిట్ కొట్టిన శ్రీకాంత్ ఓదెల ఈసారి నాని కోసం మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా స్ట్రాంగ్ ఎమోషన్స్ స్క్రిప్ట్ ని రెడీ చేసినట్లు తెలుస్తోంది. స్ట్రాంగ్ నేరేషన్, టేకింగ్, స్క్రీన్ ప్లే వంటి విషయాలలో శ్రీకాంత్ ఓదెల పర్ఫెక్ట్ గా ఉండటంతో దసరా చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫుల్ డెటెయిల్స్ తెలిసే అవకాశం ఉంది.ఈ విషయం ఇలా ఉండగా ప్రస్తుతం హీరో నాని తెలుగులో హిట్ : ది థర్డ్ కేస్ చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రంలో నాని పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి తెలుగు ప్రముఖ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నాడు. హిట్ 3 చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ కి సిద్దంగా ఉంది. దీంతో ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నారు.

# అది మా కర్తవ్యం. ఏపీ సీఎం పోస్ట్‌పై చిరంజీవి



తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం చిరంజీవి భారీ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. ఈ సాయాన్ని మెచ్చుకుంటూ సీఎం పోస్ట్ పెట్టారు. "ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయలు విరాళంగా అందించిన మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మానవ సేవలో చిరంజీవి ఎల్లప్పుడూ ముందుంటారు. వరదల వల్ల నష్టపోయిన జీవితాలను పునర్నిర్మించడంలో వారి సహకారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. దీనిపై చిరంజీవి తాజాగా స్పందించారు. "మీరు నాపై చూపించిన ఆదరణకు ధన్యవాదాలు. మన ప్రజలకు విపత్తులు ఎదురైనప్పుడు సాయం అందించడం మా కర్తవ్యం. మీ సహాయక చర్యలు ఆదర్శప్రాయం" అని అన్నారు.తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు తమ వంతు సాయం చేసేందుకు సినీతారలు ముందుకు వచ్చారు. భారీ మొత్తంలో విరాళాలు ప్రకటించారు. చిరంజీవి , ఆయన తనయుడు రామ్‌చరణ్ కోటి రూపాయలు విరాళంగా ప్రకటించారు. శనివారం ఏపీ సీఎం చంద్రబాబు ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. తన తరపున రూ. 50లక్షలు, రామ్‌చరణ్ తరపున మరో రూ. 50లక్షల చెక్కులను చంద్రబాబుకు అందజేశారు.

# నచ్చితే చేయండి.. లేకపోతే లేదు అనన్య నాగళ్ల అసహనం



తాను షేర్ చేసిన ఓ వీడియోకు వస్తోన్న విమర్శలపై నటి అనన్య నాగళ్ల స్పందించారు. ఎందుకింత నెగటివిటీ అంటూ తన అసహనాన్ని వ్యక్తంచేశారు. "ప్లాస్టిక్ వాడకం తగ్గించమని ఇటీవల నేనొక వీడియో షేర్ చేశా. దాన్ని కొందరు తప్పుబట్టారు. విమర్శలు చేశారు. చిన్న విషయం చెప్పా. నచ్చితే చేయండి.. లేకపోతే లేదు. ఎందుకింత నెగటివిటీ?" అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్‌గా మారింది.సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే అనన్య.. ఇటీవల ఓ వీడియో షేర్ చేశారు. ఇందులో ఆమె స్ట్రా సాయం లేకుండా కొబ్బరిబొండాం నీళ్లు తాగుతూ కనిపించారు. "సాధారణంగా నేను స్టీల్ స్ట్రా వెంట తెచ్చుకుంటాను. అది లేని పక్షంలో ఈ విధంగా కొబ్బరినీళ్లు తాగుతా. ప్లాస్టిక్ వాడకాన్ని కాస్త తగ్గిద్దాం. చిన్న చిన్న పనులే పెద్ద మార్పులకు శ్రీకారం చుడతాయి" అని రాసుకొచ్చారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు ఆమె అభిప్రాయాన్ని తప్పుబట్టారు. "మీ పక్కన ఉన్న ఆవిడకు ముందు చెప్పండి. ఆమె స్ట్రాతో తాగుతున్నారు" అని కామెంట్స్ చేశారు. తెలుగు అమ్మాయి అనన్య నాగళ్ల 2019లో విడుదలైన 'మల్లేశం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తొలి చిత్రంతోనే ఆదరణ సొంతం చేసుకున్నారు. 'ప్లే బ్యాక్', 'వకీల్‌సాబ్', 'శాకుంతలం', 'మళ్ళీ పెళ్లి' వంటి చిత్రాల్లో నటించారు. ఆమె నటించిన 'పొట్టేల్' విడుదలకు సిద్ధంగా ఉంది. అక్టోబర్ 25న విడుదల కానుంది.

# ఘనంగా హీరో నారా రోహిత్ నిశ్చితార్థం..



తెలుగులో సోలో, ప్రతినిధి తదితర చిత్రాల్లో హీరోగా నటించి అలరించిన టాలీవుడ్ ప్రముఖ హీరో నారా రోహిత్ శిరీష లెల్లని పెళ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిందే. దీంతో వీరిద్దరి ఎంగేజ్మెంట్ ఆదివారం (అక్టోబర్ 13) ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా హైదరాబాద్ లోని నోవాటెల్ హొటల్ లో ఇరువురి కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగింది.ఈ ఎంగేజ్మెంట్ ఫంక్షన్ కి ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణ తన సతీమణి వసుంధర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దంపతులు, బంధువులు తదితరులు హాజరై నూతన వధూవరులకి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నారా రోహిత్ కి ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా విషెస్ చెబుతున్నారు. ఈ ఎంగేజ్మెంట్ అనంతరం డిసెంబర్ 15న వీళ్లిద్దరిపెళ్లికి పెద్దలు ముహూర్తం నిర్ణయించారు.ఈ విషయం ఇలా ఉండగా ఇటీవలే నారా రోహిత్ ప్రతినిధి 2 చిత్రంలో హీరోగా నటించాడు. కానీ ఈ చిత్రం ఆడియన్స్ ని పెద్దగా అలరించలేక పోయింది. ప్రస్తుతం నారా రోహిత్ తెలుగులో సుందరకాండ అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రానికి వెంకటేశ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే ఈ చిత్ర టీజర్ రిలీజ్ కాగా మంచి రెస్పాన్స్ వచ్చింది.